సాక్షి
వికారాబాద్
బుధవారం । 23 । ఆగస్టు । 2023



'హస్తం' సీటు ఎవరికో?

బీఆర్ఎస్ తాండూరు అభ్యర్థి ఖరారు కావడంతో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నేతలు గాంధీభవన్‌కు క్యూ కట్టారు. 10లో▸



రైతుకు ఆనందం..

ఈ ఏడాది వ్యవసాయ పనుల్లో మహిళా కూలీలకు డిమాండ్ పెరగడంతో వారికి కాసుల పంట పండనుంది. 10లో▸



గ్రామాల్లో 'గులాబీ' సందడి

పరిగి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మహేశ్‌రెడ్డికి మళ్లీ అవకాశం దక్కడంతో గులాబీ నేతల్లో సందడి నెలకొంది. 10లో▸

న్యూస్‌రీల్

థ్యాంక్యూ సార్..



కొడంగల్: కొడంగల్ అసెంబ్లీ టికెట్ మళ్లీ తనకే కేటాయించడంతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



వికారాబాద్ అర్బన్: పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి ఎస్ మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో వివిధ కోర్సుల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అర్హత కలిగిన విద్యార్థిని, విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 22 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 24న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగారాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీలో 55 సీట్లు, ఎంపీసీలో 42 సీట్లు ఖాళీ ఉన్నాయని, గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

28న గిరిజన గురుకులంలో..

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఈ బలరాం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్లతో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల మధ్య హాజరుకావాలని తెలిపారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. గిరిజన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ పి.యాదయ్య గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలు తెలిపారు. చేవెళ్లలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కళాశాలలో బీఏ ఆనర్స్, ఫిలిం అండ్ వీడియో, యానిమేషన్ అండ్ వీ ఎఫ్ఎక్స్ విజువల్ ఆర్ట్స్,ఫొటోగ్రఫీ అండ్ డిజిటల్ ఇమేజింగ్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ల 94411 88669, 91107 99392లో సంప్రదించాలన్నారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తు చేయండి

వికారాబాద్ అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద మైనార్టీ విద్యార్థులు ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద రూ.20 లక్షల ఉపకార వేతనం, 60 వేల వరకు విమాన చార్జీలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంజనీరింగ్‌లో 60శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసేందుకు, అలాగే పీహెచ్‌డీ చేయాలనుకునే వారు, పీజీలో 60శాతం మార్కులు పొందిన వారు అర్హులన్నారు. జనవరి 2023 నుంచి జూలై 2023 మధ్యకాలంలో విదేశీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొంది ఉన్న మైనార్టీ విద్యార్థులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. సెప్టెంబరు 21లోపు దరఖాస్తు చేయాలని, ఇందుకు సంబంధించిన హార్డ్ కాపీలను సెప్టెంబర్ 25న జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'ముసాయిదా' విడుదల



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ నారాయణరెడ్డి

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చిన ఎన్నికల అధికారులు

- జిల్లాలో 8,98,877మంది ఓటర్లు
- ఓటు నమోదుకు సెప్టెంబర్ 19వరకు గడువు
- నాలుగు రోజులపాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు
- అక్టోబర్ 10న తుది జాబితా
- ఆధార్ అనుసంధానంతో డబుల్ ఓట్లకు చెక్

వికారాబాద్: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి మంగళవారం అధికారులు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ (ముసాయిదా ఓటరు జాబితా)ను విడుదల చేశారు. మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు సెప్టెంబర్ 19వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక ప్రచారం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. అక్టోబర్ 10న తుది జాబితాను విడుదల చేయనున్నారు. జిల్లాలో 2022 జనవరిలో విడుదల చేసిన ఓటరు తుది జాబితాతో పోలిస్తే ప్రస్తుతం ఓటర్లు స్వల్పంగా తగ్గారు. ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ నంబరు లింక్ చేయడంతో డబుల్ ఓట్లకు చెక్ పడినట్లయ్యింది. దీంతో 2,746 ఓటర్లు తగ్గారు. ఓటరు నమోదుకు మరో 25 రోజుల గడువు ఉండడంతో ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 8,98,877మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 901మంది తక్కువగా ఉన్నారు. 36 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారు. మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రోహిత్‌శర్మతో కలిసి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటరు జాబితా గురించి వారికి వివరించారు.

సెప్టెంబర్ 19 వరకు గడువు

కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సెప్టెంబర్ 19వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఆగస్టు 26, 27, అలాగే సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ప్రచార రోజులు నిర్వహించి కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తులు తీసుకోనున్నారు. సెప్టెంబర్ 19వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటించనున్నారు.

గరుడ యాప్ ద్వారా..

గరుడ యాప్ ద్వారా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఈ యాప్‌పై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. అయితే బీఎల్ఓలకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెజార్టీ బీఎల్ఓలకు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు లేకపోవడంతో యాప్‌ను వినియోగించుకోలేక పోతున్నట్లు తెలుస్తోంది.

మార్పులు, చేర్పులకు అవకాశం



మాట్లాడుతున్న లింగ్యానాయక్

కొడంగల్: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని అడిషనల్ కలెక్టర్, కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై చర్చించారు. అఖిల పక్ష నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరి చేసుకోవచ్చని సూచించారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు కూడా ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చని సూచించారు. నియోజకవర్గ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్లు విజయకుమార్, వెంకటేష్, అఖిల పక్ష నాయకులు రమేష్‌బాబు, కృష్ణంరాజు, బషీర్, గుల్షన్, చంద్రప్ప, శ్యాంసుందర్, ఎలక్షన్ డీటీ శివకుమార్, డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్ జెండర్స్	మొత్తం
పరిగి	1,22,282	1,17,567	08	2,39,857
వికారాబాద్	1,09,714	1,07,757	04	2,17,475
తాండూరు	1,08,712	1,13,407	09	2,22,128
కొడంగల్	1,09,163	1,10,239	15	2,19,417
మొత్తం	4,49,871	4,48,970	36	8,98,877

అభ్యంతరాలుంటే తెలియజేయండి



జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశాం. ఈ జాబితాను రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించాలి. ఇందులో ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే తెలియజేయాలి. ఇందు కోసం సెప్టెంబర్ 19వ తేదీ వరకు గడువు ఇచ్చాం. అక్టోబర్ 4న తది జాబితాను విడుదల చేస్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు

'గృహలక్ష్మి'ని వేగవంతం చేయండి

- 25లోపు లబ్ధిదారుల జాబితా ఆన్‌లైన్‌లో ఉండాలి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

వికారాబాద్ అర్బన్: గృహలక్ష్మి పథకం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంత చేసి ఈ నెల 25వ తేదీలోపు లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓటరు జాబితా నమోదు, గృహలక్ష్మి, హరితహారం పథకాల అమలుపై తహసీల్దార్లు, ఎంపీడీవోలతో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగానాయకులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 26న చేపట్టే మేఘా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని 269 గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయని, ఆ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ కృష్ణన్, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, డీసీడీఓ ఉపేందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో రేవంత్‌రెడ్డి పర్యటన

తాండూరు: జిల్లాలోని పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూరు నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 24న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. 26న చేవెళ్లలో ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో సభను విజయవంతం చేసేందుకు ఆయన ఆయా నియోజవర్గ కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

యోగాతో ఒత్తిడిని జయిద్దాం

- సిబ్బందికి ఎస్పీ కోటిరెడ్డి సూచన
- కార్యాలయంలో రక్షాబంధన్



ఎస్పీకి రాఖీ కడుతున్న ఓంశాంతి నిర్వాహకులు

అనంతగిరి: యోగాతో ఒత్తిడిని జయిద్దామని ఎస్పీ కోటిరెడ్డి సిబ్బందికి సూచించారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఓంశాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పనిని ఒత్తిడితో కాకుండా ప్రశాంతంగా చేసుకోవడం మంచిదన్నారు. పండుగల ప్రాముఖ్యతను పిల్లలకు తెలపాలన్నారు. అనంతరం ఓంశాంతి బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు మధు రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించి పోలీసులకు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ వీరేశం, ఏవో జ్యోతిర్మయి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, డీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, సురభివాణీదేవి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నియోజకవర్గం పరిధిలోని 300 మంది లబ్ధిదారులకు బీసీ బంధు పథకం కింద మంజూరైన రూ.3 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీలకు ఆర్థికంగా అండగా నిలిచేలా బీసీబంధు పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కులవృత్తులను అప్పటి ప్రభుత్వాలు నాశనం చేశాయని, సీఎం కేసీఆర్ చొరవ తీసుకుని వారిని గౌరవించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లుగా తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. మరోసారి అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. బీసీలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చేయూతనందిస్తుండటం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, సురభివాణీదేవి మాట్లాడుతూ.. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి రెండు సమానంగా కొనసాగుతున్నాయన్నారు. అంతకుముందు మంత్రి చౌరస్తాలోని శ్రీశైలం రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ జి. శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, మహేశ్వరం వైస్ ఎంపీపీ సునీత, వివిధ మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుంది

- అందుకే రెండు చోట్ల పోటీ
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం
- పార్టీ సీనియర్ నేత హన్మంతరావు

షాద్‌నగర్: సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే వచ్చే ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. వచ్చే నెలలో షాద్‌నగర్‌లో నిర్వహించే బీసీ డిక్లరేషన్ సభకు సంబంధించిన స్థలాన్ని మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో సీఎం గజ్వేల్‌లో గెలిచే పరిస్థితి లేదని, తన పరువును కాపాడుకునేందుకే కామారెడ్డిలో కూడా పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ వీడతారనే భయంతోనే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి కట్టబెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ఖజానా నింపుకొనేందుకే సీఎం కేసీఆర్ మద్యం దుకాణాలకు ముందస్తు టెండర్లు ఆహ్వానించారన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజల్లో ఎంతో మార్పు వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీసీల తడాఖా చూపించేందుకు షాద్‌నగర్‌లో వచ్చే నెల మూడు లక్షల మందితో పెద్ద ఎత్తున బీసీ డిక్లరేషన్ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ జాయింట్ సెక్రటరీ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో గ్రంథాలయాలు

- సంస్థ జిల్లా చైర్మన్ వెంకటరమణారెడ్డి

చేవెళ్ల: ఆధునికహంగులతో చేవెళ్లలో నూతన లైబ్రరీ భవనాన్ని అందుబాటులోకి తెచ్చి ఉద్యోగ సాధన కేంద్రంగా తీర్చిదిద్దుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు.మండలకేంద్రంలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. జిల్లాలో రూ.18కోట్ల వ్యయంతో గ్రంథాలయలకు అధునాతన భవనాలు నిర్మించటమేకాకుండా సకల వసతులు కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆయన వెంట సీనియర్ లైబ్రేరియన్ సత్యనారాయణ, ఏఈఓ శ్యాం, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఉన్నారు.

బోధన వినూత్నం

- వర్క్‌బుక్స్, కథల పుస్తకాలతో పాఠ్యాంశాలు
- ప్రయోగాత్మకంగా ప్రాథమిక పాఠశాలల్లో అమలు
- పోటీపడి చదువుతున్న విద్యార్థులు
- ఉత్తమ ఫలితాలు వస్తాయంటున్న ఉపాధ్యాయులు



మాధారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

వికారాబాద్ అర్బన్: బోధనా పద్ధతుల్లో ప్రైవేటుకు ప్రభుత్వ పాఠశాలలు ఏమాత్రం తీసిపోరాదనే ఉద్దేశంతో సర్కారు కొత్త తరహాలో బోధనకు శ్రీకారం చుట్టింది. ప్రాథమిక పాఠశాలల నుంచే ఈ పద్ధతి ప్రారంభించి మంచి ఫలితాలు సాధించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆగస్టు రెండో వారంలో విద్యార్థులకు వర్క్‌బుక్స్, కథల పుస్తకాలు పంపిణీ చేసింది. వీటితో విద్యార్థులకు అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా పాఠాలు చెప్పాలని ఆదేశించింది. ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్, లిటరసీ, న్యూమరసీ) కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించింది.

కొత్త పద్ధతిలో బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో పాత పద్ధతిలో బోధన జరుగుతోంది. దీంతో విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం పాత పద్ధతికి స్వస్తి పలకాలని భావించింది. ఇందులో భాగంగా ప్రాథమిక స్థాయి నుంచే చిన్నారుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని పాఠ్యపుస్తకాలతో పాటు, వర్క్‌బుక్స్, కథల పుస్తకాలను పంపిణీ చేసింది.

5 ప్లస్ 1 పద్ధతిన బోధన

ఐదు రోజులు తరగతులు, ఒక రోజు అభ్యసనాలు చేయించమే 5 ప్లస్ 1 పద్ధతి ఉద్దేశం. తెలుగు, గణితం సబ్జెక్టులకు 90 నిమిషాల సమయం ఉంటే, అందులో 45 నిమిషాలు విద్యార్థులను ఆకట్టుకునేలా పాఠం బోధించాలి. ఆ తరువాత 25 నిమిషాలు చెప్పిన పాఠం నుంచే వర్క్‌బుక్ రాయించాలి. మరో 20 నిమిషాల పాటు విద్యార్థులకు ఆసక్తి కలిగే కథ చెప్పడంతో పాటు, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటివి చేయాలి. ఏ రోజు చెప్పిన పాఠాన్ని ఆ రోజే విద్యార్థులతో వర్క్‌బుక్ రాయించాలి. సాధారణంగా ఒక విద్యా సంవత్సరంలో 220 పనిదినాలు ఉంటాయి. ఇందులో 140 రోజులు పాఠ్యాంశాల బోధనకు సరిపోతుందని నిపుణుల అంచనా. మిగతా రోజుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృత్యాధార బోధన చేపట్టాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ వర్క్‌బుక్స్‌ను పంపిణీ చేసింది.

ఫార్మార్మర్ గ్రూపులోకి వచ్చేలా..

తరగతిలోని విద్యార్థులను మూడు గ్రూపులుగా విభవిస్తారు. ఫార్మార్మర్, మీడియం, టీచర్ సపోర్ట్ అనే గ్రూపులు ఏర్పాటు చేస్తారు. విద్యార్థులందరూ ఫార్మార్మర్ గ్రూపులోకి వచ్చేలా గుణాత్మకంగా కృత్యాధార బోధన చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థిలో అభ్యసన సామర్థ్యాలు పెంచాల్సి ఉంటుంది. గతంలో పాఠ్య ప్రణాళిలు రూపొందించుకొని రెండు ఫార్మటివ్ అసెస్‌మెంట్, నాలుగు సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించే వారు. ప్రస్తుతం ప్రతివారం పాఠ్యాంశాలకు సంబంధించిన సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

50వేల మంది విద్యార్థులకు మేలు

జిల్లాలో 764 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 43,364 మంది విద్యార్థులు, ప్రాథమికోన్నత పాఠశాలలు 116 ఉండగా 12,210 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 6వ తరగతి, 7వ తరగతి మినహాయించగా 8వేల మంది విద్యార్థులు ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. ఈ లెక్కన జిల్లాలోని విద్యార్థులకు 1,54,092 వర్క్‌బుక్స్ అందజేశారు.

విద్యార్థులకు ఎంతో మేలు



ప్రాథమిక స్థాయి విద్యార్థులకు వర్క్‌బుక్ ఎంతో ఉపకరిస్తాయి. 5 ప్లస్ 1 పద్ధతి పాటిస్తే చదువులో బాగా రాణిస్తారు.పాఠం చెప్పిన కొన్ని రోజులకు విద్యార్థులు మరచిపోయే అవకాశం ఉంటుంది. వర్క్‌బుక్ పద్ధతి పాటిస్తే ఎక్కువ కాలం గుర్తుండి పోతుంది.

– నాగరాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

గుర్తుండి పోతుంది



వర్క్‌బుక్స్ రాయడం వల్ల చెప్పిన పాఠం గుర్తుండి పోతుంది. ప్రతి పాఠాన్ని పూర్తిగా అవగాహన కలిగే వరకు చెబుతున్నారు. దీంతో వర్క్‌బుక్ పూర్తి చేసేందుకు పోటీ పడుతున్నాం.

– ధర్షిణి, 5వ తరగతి, వికారాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

పోటీ పెరిగింది



వర్క్‌బుక్స్ ఇవ్వడంతో మాలో పోటీ పెరిగింది. దీంతో ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నప్పుడు శ్రద్ధగా వింటున్నాం. పోటీ పడి వర్క్‌బుక్ పూర్తి చేసి ఉపాధ్యాయులతో శభాష్ అనిపించుకుంటున్నాం.

– అరుణ్, 5వ తరగతి, మాధారం ఉన్నత పాఠశాల

క్లుప్తంగా

కుందేళ్ల వేటకు వెళ్లి..

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


పోచయ్య(ఫైల్)

పరిగి: కుందేళ్ల వేటకు వెళ్లిన వారిని గ్రామస్తులు వెంబడించడంతో.. పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా ఖుదావన్పూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మాదారానికి చెందిన బోయిన పోచయ్య(40) మరో ఇద్దరితో కలసి సోమవారం రాత్రి కుందేళ్ల వేటకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారని భావించిన గ్రామస్తులు వీరిని వెంబడించారు. భయంతో పరుగులు పెడుతున్న క్రమంలో అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు.. రైతు సుబ్బారెడ్డి వేసిన విద్యుత్ కంచెకు తగిలి పోచయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు.. మృతుడు మాదారానికి చెందిన పోచయ్యగా గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోచయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల సాధనకు కృషి

మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ



వికారాబాద్ అర్బన్: మున్సిపల్ ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేస్తానని మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన మున్సిపల్ ఉద్యోగుల జిల్లా ఫోరం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ కొలువుదీరింది. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగుల ఐక్యతకు, హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా కార్యదర్శిగా తాండూరు మున్సిపాలిటీకి చెందిన ఆంజనేయులు, అసోసియేషన్ అధ్యక్షులుగా పి.సంపత్ కుమార్, ట్రెజరర్గా పి.విఠల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అడహక్ కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ టి.పర్వతాలు, టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి ఎం.డి అఫ్జల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో అస్రాబేగంకు 18వ ర్యాంక్



తాండూరు టౌన్: ఉస్మానియా యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలో తాండూరుకు చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించింది. పట్టణంలోని సింధు కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఎండీ అస్రాబేగం మంగళవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 18వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆమెను కళాశాల వ్యవస్థాపకులు రంగారావు, ప్రిన్సిపాల్ విజయాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రఘునందన్ రెడ్డి, ఫిజిక్స్ అధ్యాపకులు సాయికుమార్ గౌడ్ అభినందించారు.

బోరు మోటారు చోరీ

నందిగామ: బోరు మోటారును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు జంగిలి ఆంజనేయులు ప్రకారం.. తన వ్యవసాయ పొలంలోని బోరు మోటారును ఈ నెల 17న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఈ విషయమై స్థానిక ఇన్‌స్పెక్టర్ సురేశ్‌ను వివరణ కోరగా గ్రామంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

తాండూరు 'హస్తం' ఎవరికో..?

- అసెంబ్లీ నుంచి పోటీ చేసేందుకు డజనుకుపైగా ఆశావహులు
- ఇప్పటికే సీఈసీకి ఆరుగురు దరఖాస్తు
- ఉత్కంఠగా ఎదురు చూస్తున్న పార్టీ శ్రేణులు
- పైలట్‌ను ఢీకొట్టే అభ్యర్థిని రంగంలోకి దించేలా పావులు


ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి

తాండూరు: బీఆర్‌ఎస్ సోమవారం అభ్యర్థులను ఖరారు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలు గాంధీభవన్‌కు క్యూ కట్టారు. అసెంబ్లీ టికెట్ ఆశించే వారి నుంచి ఈ నెల 18 నుంచి 25వ వరకు దరఖాస్తులు స్వీకరించి 25న స్క్రుటినీ అనంతరం సీఈసీ అందించనున్నారు. ఈ నేపథ్యంలో తాండూరు నుంచి టికెట్ కోసం అభ్యర్థులు పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. ఇప్పటికే అరడజను మందికి పైగా దరఖాస్తు చేశారు. వీరిలో ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి, పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, నియోజకవర్గ నాయకులు ఉత్తమ్ చంద్, జనార్దన్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుకు మరో మూడు రోజులు గడువుండడంతో మరో అరడజను మందికి పైగా దరఖాస్తు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వీరిలో తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతా సంపత్, పార్టీ రాష్ట్ర నాయకురాల కల్వ సుజాత, మర్రి ఆదిత్య రెడ్డి, మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ ఇక్కడ నుంచి పోటీకి దరఖాస్తు చేయనున్నట్లు సమాచారం.

అదృష్టం వరించేనా..?

నియోజకవర్గంలో మహరాజుల కుటుంబానికి ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. మాజీ మంత్రి మాణిక్‌రావు నాలుగు సార్లు ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర మంత్రి వర్గంలో పలు శాఖల్లో పనిచేసిన ఆయన జాతీయ స్థాయిలో కీర్తి గడించారు. అనంతరం మాణిక్‌రావు సోదరులు చందుమహరాజ్ రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, నారాయణరావు ఎమ్మెల్యేగా పని చేశారు. వీరి కుటుంబం నుంచి ఏడు సార్లు తాండూరు అసెంబ్లీకి ఎన్నికై రికార్డు సృష్టించారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి మాణిక్‌రావు తనయుడు, ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014 అసెంబ్లీ టికెట్ రమేష్ మహరాజ్‌కు టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం సానుకూలంగా ఉన్నా ఆయన మాత్రం బాబాయ్ నారాయణరావుకు అవకాశం ఇచ్చారు. ఆ ఎన్నికలల్లోనూ కాంగ్రెస్ ఓటమి చవిచూసింది. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాష్ట్రంలో అసెంబ్లీ అభ్యర్థిగా రెండేళ్ల ముందే రమేష్ మహరాజ్ పేరు ప్రకటించింది. అయితే ఎన్నికల సమయంలో వర్గపోరుతో సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి త్యాగం చేశారు. ఎన్నికల అనంతరం రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌ని వీడి కారెక్కారు. దీంతో తిరిగి రమేష్ మహరాజ్ పార్టీ బాధ్యతలను ఎత్తుకున్నారు. నాలుగేళ్లుగా పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేశారు. అయితే వయోభారం కారణంగా రాష్ట్ర కమిటీ రమేష్ మహరాజ్ టికెట్ కేటాయించడంలో మీనామేశాలు లెక్కిస్తుందని చర్చించుకుంటున్నారు. జాతీయ స్థాయిలో పలుకుబడి ఉండటంతో రమేష్ మహరాజ్ ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. రమేశ్‌మహరాజ్‌కు టికెట్ వరిస్తుందా లేదా అనేది చర్చనీయాంశమైంది.


దరఖాస్తు అందజేస్తున్న జెడ్పీటీసీ ధారాసింగ్

గ్రామాల్లో 'గులాబీ' సందడి

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి ఘన స్వాగతం పలికిన బీఆర్‌ఎస్‌నాయకులు


పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పరిగి: పరిగి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి రెండోసారి అవకాశం దక్కింది. దీంతో ఎమ్మెల్యేకు మంగళవారం పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మన్నెగూడ నుంచి పరిగి ఎమ్మెల్యే నివాసం వరకు భారీ కాన్వాయ్ ఏర్పాటు చేసి గ్రామాల్లో టపాసులు కాల్చి సంబరాల నడుమ స్వాగతం పలికారు. అడుగడుగునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గ్రామాలను గులాబీ వనంగా మార్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, పీఏసీఎస్‌వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్‌రెడ్డి వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొ న్నారు.

నందీశ్వరా.. నాలుగోసారి ఆశీర్వదించు

నందివనపర్తి శివాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి ప్రత్యేక పూజలు


నంది చెవిలో కోరికను చెబుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: నందీశ్వరా.. నాలుగోసారి నన్ను ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినవుతానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంగళవారం నందివనపర్తి గ్రామంలోని నందీశ్వరుడికి మొక్కుకున్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎన్నికల సెంటిమెంట్‌లో ప్రతీసారి నందివనపర్తి గ్రామంలోని నందీశ్వరుడికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సీఎం కేసీఆర్ సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ప్రకటించడంతో ఆయన నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను మూడు సార్లు నందీశ్వరుడికి తొలి పూజ చేసిన తర్వాతే ఎన్నికల ప్రచారానికి వెళ్లానని గుర్తు చేశారు. తన సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశానని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని మరింత ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడమే తన జీవిత లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నందివనపర్తి సర్పంచ్ ఉదయశ్రీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వర్త్యవత్ రాజునాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

'ఆరోగ్య మహిళ'పై ఆరా


పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఏ విధమైన చికిత్సలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం గురించి ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందితో కలిసి ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవిత్ర, డాక్టర్ నేహా గీతి, ఎస్‌ఓ చంద్రశేఖర్, డీపీఓ మహేశ్, హెచ్‌ఈ శ్రీనివాస్, సీహెచ్‌ఓ మురళి తదితరులు ఉన్నారు.

సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలం

- ప్రతీ గ్రామంలో పాదయాత్రలు, సమీక్షలు నిర్వహిస్తాం
- పార్టీ బలోపేతానికి పనిచేసే వారికి తప్పక గుర్తింపు
- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మాల్ గ్రామంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: రాష్ట్రంలోని సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడంతో సీఎం కేసీఆర్ ఉచిత హామీలతో ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని మాల్ గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రతీ గ్రామంలో పాదయాత్రలు చేపడతానన్నారు. సమీక్షలు నిర్వహించి బలోపేతంపై దృష్టి పెడతానన్నారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తే విజయం నల్లేరుపై నడకేనన్నారు. ఈ మూడు నెలలపాటు పార్టీ శ్రేణులంతా ప్రజల్లో ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతీ ఒక్కరికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. అనంతరం ఇషా ఆస్పత్రి వైద్య బృందం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి ఇటీవల తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, జ్యోతినాయక్, రామకృష్ణ, మాల్ సర్పంచ్ కవిత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు అరవింద్‌నాయక్, రాజారెడ్డి, నారాయణరెడ్డి, శేఖర్‌గౌడ్, జంగీర్, శ్రీశైలం, సంపత్‌కుమార్, అమృతాసాగర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మంగళూరు ఎమ్మెల్యే వేదవ్యాన కామత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్

కొత్తూరు: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పేరిట సీఎం కేసీఆర్ సాగిస్తున్న కుటుంబ పాలనకు చమరగీతం పాడాలని కర్ణాటక రాష్ట్రం మంగళూరు సౌత్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మంగళవారం షాద్‌నగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వేదవ్యాస్ మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రవాస్‌యోజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న సాయం... మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్శిస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధిని మరిచిన బీఆర్‌ఎస్ నాయకులు ఇతర పార్టీలపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు మాత్రమే రాష్ట్రాన్ని పాలిస్తూ ప్రజా సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. నాయకులు విజయ్‌కుమార్, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబ య్య, మిథున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నర్సింహాగౌడ్, నాగరాజు చారి, మహేందర్‌రెడ్డి, రణధీర్ గౌడ్, మల్లేశ్, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఆనందం.. కూలీలకు ఆదాయం

- వరినాట్లతో మహిళలకు చేతినిండా పని
- రోజుకు రూ.600 నుంచి రూ.900వరకు దినసరి కూలి
- ఏటేటా పెరుగుతున్న డిమాండ్


నాట్లేస్తున్న మహిళలు

బొంరాస్‌పేట: ఈ ఏడాది వానాకాలంలో మహిళా కూలీలకు కాసుల పంట పండుతోంది. వ్యవసాయ పనుల్లో మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది. వరి నాట్లు, కలుపుతీతల పనుల్లో చేతినిండా పని దొరుకుతోంది. రోజుకు రూ.600 నుంచి రూ.900వరకు దినసరి కూలి పడుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా వరినాట్లు

దుద్యాల, బొంరాస్‌పేట మండలాల్లో ఇప్పటికే ఖరీఫ్ ఆరుతడి పంటలు సాగులో ఉండగా వరిసాగు పనులు చివరి దశలో ఉన్నాయి. మెట్ట పొలాల్లో కలుపుతీత పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఇటు రైతులు, అటు కూలీలు బిజీ అయ్యారు. కుండపోత వర్షాలతో భూగర్భ జలాలు పెరుగుతూ నీళ్లు పుష్కలంగా లభిస్తున్నాయి. బొంరాస్‌పేట పెద్ద చెరువు, ఏర్పుమళ్ల కాకర్‌వాణి ప్రాజెక్టు, అన్ని చెరువులు, కుంటలు నీరు ఇంకా చేరకపోవడంతో వేసవి పంటలపై ఆశలు పెట్టుకున్నారు. రెండు మండలాల్లో దాదాపు 16 వందల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రయాణ చార్జీలు

రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు ప్రస్తుతం చేతినిండా పని దొరుకుతోంది. కొన్ని చోట్ల కూలీల కొరత ఏర్పడుతుండడంతో రైతులు పొరుగు ఊళ్ల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. అధిక దినసరి కూలీరేట్లు, ప్రయాణ చార్జీలు, అదనపు సౌకర్యాలు కల్పించి మరీ పనులు చేయించుకుంటున్నారు. రోజువారి కూలి రేట్లు కూడా పెరిగాయి. ఒక్కో మహిళా కూలీ రూ.400లకు పైగా ఉండగా గుత్త పనుల్లో రూ.900వరకు ఆర్జిస్తున్నారు.

పెట్టుబడి పెరిగింది

సాగు నీరు ఆశాజనకంగా ఉండటంతో ఈఏడాది వరి పంట సాగు చేస్తున్నాం. మెట్టపొలాల్లోనూ వరి సాగు చేపడుతున్నారు. ఓ పక్క వానలు విరివిగా కురిసి చెరువులు, కుంటలు నిండాయి. వ్యవసాయ బోర్ల కింద వరిని సాగుచేయసాగారు. నాట్లు వేసే పనులకు పెట్టుబడి డబ్బులు పెరిగాయి.

– హన్మమ్మ, రైతు, గాజులకుంటతండా

కాలం కలిసొచ్చింది

ఈసారి ఆడోళ్ల కూలిరేట్లు బాగా పెరిగాయి. నిరుడు రూ.300 ఉండగా ఈసారి రూ.500కంటే ఎక్కువ వస్తున్నాయి. కూలీచేయని కుటుంబాలు కూడా పనులకు పోతున్నరు. నెల రోజుల్లో ఒక్కో కూలీ రూ.10వేల వరకు సంపాదించారు. వచ్చే రోజుల్లో మరింత రేట్లు పెరగున్నాయి.

– జెమినీబాయి, కూలి, మెట్టుచెల్కతండా

కూలీల కొరత ఏర్పడింది

ఈసారి ఎన్నడు లేనంతగా కూలీల కొరత ఏర్పడింది. దానికి తోడు కూలిరేట్లు కూడా ఎక్కువయ్యాయి. రోజువారి కూలీతో పాటు అదనపు ఖర్చులతో పెట్టుబడి పెరుగుతోంది. పంటలు పండితేనే రైతు కుటుంబాలకు మేలు. లేదంటే పెట్టుబడి, కూలీల ఖర్చులకే సరిపోతుంది.

– పావని, రైతు, చౌదర్‌పల్లి

బైక్ దొంగలకు రిమాండ్

పహాడీషరీఫ్: ఇళ్ల ఎదుట పార్క్ చేసిన వాహనాలను చోరీలు చేస్తున్న ఇద్దరిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. తుక్కుగూడలోని తన కార్యాలయంలో మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్ కేసు వివరాలు వెల్లడించారు. తుక్కుగూడ ఓఆర్ఆర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు దొంగతనాల చిట్టా విప్పారు. తమిళనాడు చెందిన సంతోష్ కుమార్(20), పోతురాజు ముతురామ న్(26), పెరుమాల్ రాములు బతుకుదెరువు నిమిత్తం మహేశ్వరం వచ్చారు. ఓ షెడ్డు అద్దెకు తీసుకుని చిప్స్ వ్యాపారం చేస్తున్నారు. వ్యసనాలకు బానిసలవ్వడంతో చోరీలకు పాల్పడుతున్నారు. పహాడీషరీఫ్, మహేశ్వరం, కందుకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇళ్ల ఎదుట పార్కు చేసిన బైక్‌లు, ఆటోలను మాస్టర్ తాళంచెవిలను వినియోగిస్తూ చాకచక్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. పెరుమాల్‌రాము పరారీలో ఉండగా, మిగిలిన ఇద్దరిని అరెస్ట్ చేశారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


విద్యార్థులకు సర్టిఫికెట్ అందించి కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని స్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో విద్యార్థులకు లీడర్ షిప్ ఎన్నికలు నిర్వహించారు. వేయి మందికి ఒక గ్రూప్ చొప్పున ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో లీడర్‌కు ఓటింగ్ ద్వారా బ్యాచ్‌లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించారు. క్రమ శిక్షణతో మెలుగుతూ ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హరేండస్ స్వామీజీ, సరల్ స్వామీజీ, పాఠశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శ్రీధర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనంతరెడ్డి, నాయకులు శ్రీహరియాదవ్, జీవంతు తదితరులు పాల్గొన్నారు.

అక్కడ సీఎం ఇక్కడ ఎమ్మెల్యే ఇద్దరిదీ కుటుంబ పాలనే


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- 500 మంది అనుచరులతో కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి

శంకర్‌పల్లి: రాష్ట్రంలో సీఎం కేసీఆర్, చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన సాగిస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఏసీఎస్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్ రెడ్డితో పాటు మహాలింగపురం గ్రామం నుంచి బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన 500మందితో కలిసి హస్తం గూటికి చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విలువైన ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ సీఎం కుంటుంబ వేల కోట్లకు ఎదిగారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమిస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన భూములను లాక్కుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ శ్రీకాంత్, నాయకులు రవీందర్, యూసుఫ్‌ఖాన్, లక్ష్మారెడ్డి, శంకర్, విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రశాంత్, రాములు, సత్యం, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్


దిర్సంపల్లి పాఠశాలలో సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

దోమ: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ.. 317 జీఓతో ఇబ్బందిపడిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. తమకు రావాల్సిన పీఆర్‌సీని ప్రకటించి, బదిలీలు, పదోన్నతులను కల్పించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.వేణుగోపాల్, మండల అధ్యక్షుడు కేశవులు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, పీఆర్‌టీయూ సంఘం సభ్యులు సతీశ్, బీమ్యా నాయక్, నిల్‌సింగ్, వెంకటయ్య, భీమయ్య, వెంకటేశ్, వీరప్ప, ప్రవీణ్‌సింగ్, శ్రీనివాస్, చైతన్య, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.